జిల్లాల్లో కోర్టులకు మౌలిక వసతులు కల్పిస్తాం

- హైకోర్టు సిజె జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్‌తో సిఎం సమావేశం


హైకోర్టు సిజె జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్‌తో సమావేశంలో సిఎం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో వివిధ జిల్లాల్లో కోర్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. సిబ్బంది నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగాఉందన్నారు. రాష్ట్రంలో న్యాయ వ్యవస్థకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన, న్యాయస్థానాల్లో సిబ్బంది నియామకం వంటి అంశాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌తో సిఎం రేవంత్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ముఖ్యంగా కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు, మౌలిక వసతులను కల్పించడంతోపాటు అవసరమైన మేరకు సిబ్బంది నియామకాలను చేపట్టాలని జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ సూచించారు. ఈ అంశాలకు సంబంధించి పలు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. వీటిపై సిఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ సామ్ కోశి, జస్టిస్ అభినంద్ కుమార్ శావిలి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె.రామకృష్ణారావు, అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బైరాన్‌పల్లి గ్రామాన్ని 'వీర బైరాన్‌పల్లి'గా మార్చండి

సిఎం రేవంత్‌కు ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వినతి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో
సిద్దిపేట జిల్లాలోని దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామాన్ని 'వీర బైరాన్ పల్లి'గా మార్చాలని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ఆయన కలిశారు. ఈ సందర్భంగా చామల మాట్లాడుతూ రజాకార్ల అరాచకాలపై వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన అమరులకు ఈనెల 17న బైరాన్‌పల్లి గ్రామంలో నివాళులర్పించినట్టు తెలిపారు. ఆ సందర్భంగా స్మారం, బురుజు అభివృద్ధి కోసం రూ.10 లక్షలు ఇచ్చినట్టు తెలిపారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీమేరకు ఆ గ్రామాన్ని వీర బైరాన్ పల్లిగా మార్చాలని కోరారు. 1947 ఆగస్టు 27న బైరాన్‌పల్లి గ్రామంలో జరిగిన విషాదకరమైన, చారిత్రాత్మక సంఘటనను సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఆ తెలంగాణ చరిత్రలో చీకటి అధ్యాయనంగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో ఉన్న వారే పేదవారా?

- అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లివ్వాల్సిందే..
- బోనకల్ పాదయాత్ర ముగింపు సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో
మల్లు భట్టి విక్రమార్క.. కాంగ్రెస్‌కు ఉపముఖ్యమంత్రా, తెలంగాణ రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రా..? సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఉన్నవారే పేదవారా?.. మిగతా వారు పేదలు కాదా? ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పక్షపాతం మానుకోకపోతే డిప్యూటీ సిఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ఇందిరమ్మ గ్రామ కమిటీలను రద్దు చేయాలని, గ్రామ పంచాయతీలలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం లక్ష్మీపురం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సాగింది. ఈ పాదయాత్రను సిపిఎం సీనియర్ నాయకులు మాదినేని నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా కిలారు తిరుపతయ్య స్తూపానికి పోతినేని సుదర్శన్‌రావు పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం జెండాను జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఎగురవేశారు. అనంతరం పోతినేని సుదర్శన్‌రావు, సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. తహశీల్దార్ కార్యాలయం ముందు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ మద్దెల రమాదేవికి వినతిపత్రం అందజేశారు. పాదయాత్ర ముగింపు సభలో పోతినేని మాట్లాడుతూ ఆనాడు మధిర ఎమ్మెల్యేగా ఉన్న బోడెపూడి వెంకటేశ్వరరావు నియోజకవర్గ అభివృద్ధి కోసం బాగా కృషి చేశారని తెలిపారు. భట్టి తన పక్షపాతాన్ని విడనాడకపోతే పేదలందరితో కలిసి భట్టి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ చిహ్నం

- పూలను పూజిస్తూ..ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే గొప్ప పండుగ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఈ మేరకు సిఎంఒ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని సిఎం పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు, ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆడపడుచులందరూ కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ సామాజిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని తెలిపారు. ఎంగిలిపూల నుంచి సద్దుల వరకు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ సంబురాలను ఆట పాటలతో అందరూ వైభవంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో బతుకమ్మ వెలుగులు నింపాలని, అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని గౌరమ్మను సిఎం ప్రార్థించారు.

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ చిహ్నమని, అస్తిత్వానికి ప్రతిరూపమని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య తెలంగాణ ఆడబిడ్డలందరూ బతుకమ్మ పండుగ జరుపుకోవాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సామూహిక జీవనానికి, ఐకమత్యానికి, సంస్కృతిక శక్తికి ప్రతీక మన బతుకమ్మ పండుగ నిలుస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రకృతిమాత బతుకమ్మ వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బతుకమ్మ నిలువెత్తు నిదర్శనమని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మలో ఉపయోగించే ప్రతి పువ్వుకీ ఔషధ గుణాలుంటాయని, తీరొక్క పూలతో ప్రకృతి మాతకు కృతజ్ఞత చాటే పండగ బతుకమ్మ అని కొనియాడారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవ అడ్డా అయిన ఓరుగల్లు గడ్డమీద బతుకమ్మ సంబురాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని, ఆరంభ వేడుకల్లో తనతో పాటు ఇతర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క పాల్గొంటారని మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. చారిత్రక ప్రదేశాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాల్లో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేసిందని ప్రకటించారు.

ఎస్ఎఫ్ఐ, ఐద్వా, టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో
నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఎస్ఎఫ్ఐ, ఐద్వా, టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. లెక్చరర్లు, విద్యార్థినులు ఆటపాటలతో సంతోషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, ఐద్వా నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ.. ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా మహిళలు, ఆడపిల్లలకు రక్షణ కరువైందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆడ బిడ్డలు జరుపుకునే పండుగ బతుకమ్మ అని చెప్పారు. అందరూ కలిసి స్నేహభావంతో పూలతో బతుకమ్మలను పేర్చి ఒక దగ్గర పెట్టి ఆడిపాడుతూ జరుపుకునే పండుగ బతుకమ్మ అన్నారు. సమాజంలో నేటికీ మహిళలను రెండో తరగతి పౌరులుగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బేటీ బచావో – బేటీ పఢావో అని చెబుతున్న దేశంలో స్త్రీ నిష్పత్తి తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యంపై కృషి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ కన్వీనర్ మేకల వరుణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, ఐద్వా జిల్లా అధ్యక్షులు వరలక్ష్మి, అనురాధ, తుమ్మల పద్మ, అరుణ, గోవర్ధన, ఉమ నాగమణి, సుల్తాన్, జంజరాల ఉమ, మారుపాక కిరణ్, సైఫ్, నవదీప్, రియాజ్, సాయి, కళాశాల లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.


బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్న పలు సంఘాల మహిళలు

శర్మిష్టా షెనాయ్ 'క్యాండిల్ ఇన్ ది విండ్' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శిఖా గోయెల్

ప్రజాశక్తి – హైదరాబాద్
ప్రముఖ ట్రూ క్రైమ్ రచయిత, విక్రమ్ రాణా మిస్టరీ సిరీస్ రచయిత శర్మిష్టా షెనాయ్ తాజా పుస్తకం 'క్యాండిల్ ఇన్ ది విండ్స్' పుస్తకాన్ని మాధాపూర్‌లోని స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అండ్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ డిజి శిఖా గోయెల్ ఆవిష్కరించారు. మహిళలపై జరిగిన నేరాలను పోలీసు కేస్ ఫైల్స్ ఆధారంగా సమగ్రంగా వివరించారు. ఈ 'క్యాండిల్ ఇన్ ది విండ్' పుస్తకంలో ఐదు నిజ జీవిత కథలు కలవు. ఈ పుస్తకంలో మహిళలపై జరిగిన నేరాలు, మానసిక, సమాజం, వ్యవస్థల వైఫల్యాలు స్పష్టంగా ప్రతిబింబించబడ్డాయి. ఈ సందర్భంగా రచయిత శర్మిష్టా షెనాయ్ మాట్లాడుతూ.. ఈ కేసులను హైదరాబాదు పోలీస్ శాఖలో శిఖా గోయెల్, ఆమె బృందం దర్యాప్తు చేశారన్నారు. నేరస్తులను శిక్షించగలిగారన్నారు. ఇది న్యాయ వ్యవస్థ బలాన్ని నిరూపిస్తుందని తెలిపారు. కానీ చట్టం తన దారిలో నడుస్తున్నప్పటికీ, సమాజం కూడా మారాలన్నారు. అన్యాయాన్ని చూసినప్పుడు స్వరం వినిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, హైదరాబాదు లిటరరీ ఫెస్టివల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉషా రామన్, బిట్స్ పిలాని, హెచ్‌ఎల్‌ఎఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.విజయ్ కుమార్, ది టైమ్స్ ఆఫ్ ఇండియా మాజీ ఎడిటర్ కింగ్షుక్ నాగ్ పాల్గొన్నారు.

చిన్నారిని కడతేర్చిన తండ్రి

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో
మద్యం మత్తులో పసికందును కన్నతండ్రే కడతేర్చాడు.. 12 నెలల చిన్నారి కాళ్లు పట్టుకుని నేలకేసి కొట్టి చంపాడు. ఈ దారుణ ఘటన శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రియాంక కాలనీలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలం కొత్తగూడ గ్రామపంచాయతీకి చెందిన వెంకటేష్–నాగమణి దంపతులు స్థానిక తాళ్లగడ్డలోని ప్రియాంక కాలనీలో నివాసముంటున్నారు. వెంకటేష్ రోజూ మద్యం సేవించి భార్యను హింసించేవాడు. ఈ క్రమంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఇరు కుటుంబాల వారు భార్యాభర్తలకు నచ్చజెప్పారు. ఊరు మారితే వెంకటేష్‌లో మార్పు వస్తుందనుకుని వారం రోజుల కిందట ప్రియాంక కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. స్వగ్రామం కొత్తగూడెంలో వ్యవసాయం పనులు చేసి వచ్చేవాడు. కానీ మద్యం తాగడం.. నాగమణిని వేధించడం మానలేదు. శుక్రవారం రాత్రి కూడా తాగొచ్చిన వెంకటేష్‌ను నాగమణి నిలదీసింది. ఈ క్రమంలో గొడవ జరిగి భార్య చెయ్యిని కొరకడంతో ఆమె గట్టిగా అరిచింది. దాంతో చిన్నారి భవిజ్ఞ(12 నెలలు) నిద్ర లేచి ఏడ్వడంతో మద్యం మత్తులో ఉన్న తండ్రి పసికందు నోరు గట్టిగా మూశాడు. ఇది గమనించిన నాగమణి చిన్నారి మూతి దగ్గర పెట్టిన భర్త చేయి తీసే ప్రయత్నం చేసింది. భార్యను పక్కకు నెట్టేసి చిన్నారి రెండు కాళ్లు పట్టుకొని నేలకు రెండుసార్లు కొట్టాడు. వెంటనే నాగమణి బంధువులకు ఫోన్ చేసి చెప్పి.. చిన్నారిని సూర్యాపేట ప్రభుత్వాస్పత్రికి తరలించింది. కొన ఊపిరితో ఉన్న చిన్నారికి వైద్యులు కృత్రిమ శ్వాస అందించేందుకు ప్రయత్నం చేశారు.

రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో అధిక ఫీజులు వసూలును అరికట్టాలని తెలంగాణ వైద్య విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ చైర్మెన్ జస్టిస్ కె.గోపాల్‌రెడ్డిని కలిసి తెలంగాణ వైద్య విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాదె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రశేఖర్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో రూ.12 కోట్ల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో
శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.12కోట్ల గంజాయిని శనివారం అధికారులు పట్టుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయ్ నుంచి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి భారతదేశానికి చెందిన ఓ ప్రయాణికురాలు వచ్చారు. నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, హైదరాబాద్ జోనల్ యూనిట్‌లోని డిఆర్ఐ అధికారులు ఆమెను అడ్డగించారు. ఆమె సామాన్లను తనిఖీ చేయగా ముద్దగా ఉన్న పదార్థపు ప్యాకెట్లను గుర్తించారు. మొత్తం 6 కిలోల హైడ్రోపోనిక్ కలుపును (పదార్థం) స్వాధీనం చేసుకున్నారు. అధికారులు నిర్వహించిన పరీక్షలో అది గంజాయికి సానుకూల పదార్థమని తేలింది. ప్రయాణికురాలిని విచారించగా.. ఆమెకు చెందిన మరో చెక్-ఇన్ బ్యాగ్ తప్పుగా ఉంది. దాని కోసం ఆమె అప్పటికే ఫిర్యాదు చేసింది. ఆ సామాను కూడా హైదరాబాద్‌కు చేరుకుంది. దీన్ని కూడా పరిశీలించి.. అందులో మరో 6 కిలోల హైడ్రోపోనిక్ కలుపును గుర్తించారు. మొత్తం 12 కిలోల హైడ్రోపోనిక్ కలుపును స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.12 కోట్లు ఉంటుంది. ఎన్‌డిపిఎస్ చట్టం, 1985 నిబంధనల ప్రకారం ప్రయాణికురాలిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నేతలను సంప్రదించలేదు

- కొత్తపార్టీ పెట్టడంపై నిర్ణయం తీసుకోలేదు
- నీటిపారుదల శాఖపై 2016లో కెసిఆర్‌ను అలర్ట్ చేశాను
- చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో
కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఆ పార్టీ నుంచి బయటకు పోతున్నాడేమో అన్న అనుమానం కలుగుతున్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రేవంత్‌రెడ్డి తన పేరును పదేపదే తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో ఆమె చిట్ చాట్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నేతలతో అప్రోచ్ కాలేదనీ, ఆ పార్టీలో చేరే ఉద్దేశమే తనకు లేదని స్పష్టం చేశారు. కొత్త పార్టీ పెట్టాలా? వద్దా? అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. పార్టీ పెట్టేముందు కెసిఆర్ వందల మందితో చర్చలు జరిపారనీ, ప్రస్తుతం తాను అదే చేస్తున్నానని తెలిపారు. తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మెదటి కూతుర్ని తానేనని తెలిపారు. నీటిపారుదల శాఖలో జరుగుతున్న పరిణామాలపై కెటిఆర్‌ను 2016లో అలర్ట్ చేశానని గుర్తుచేశారు. కాళేశ్వరం విషయంలో ప్రతి నిర్ణయం కూడా కెసిఆర్ దేనని పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హరీశ్‌రావు చెప్పారని గుర్తుచేశారు. కాళేశ్వరం విషయంలో తప్ప మిగతా అంశాల్లో హరీశ్‌రావుపై తనకు కోపంలేదన్నారు. తాను ఒక వర్గం కోసం కాకుండా ప్రజలందరి కోసం పనిచేయాలనుకుంటున్నానని చెప్పారు. బిసి అంశం తన మనస్సుకు దగ్గరగా ఉందన్నారు. తాను ప్రస్తుతం ఫ్రీ బర్డ్‌ననీ, ద్వారాలు ఇంకా తెరిచే ఉన్నాయని చెప్పారు. తనతో టచ్‌లో ఉన్న బిఆర్ఎస్ నేతల లిస్టు చాలా పెద్దగా ఉందనీ, ఇతరులు కూడా పెద్ద ఎత్తున కలుస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను తీసుకుని ముందుకు పోతానని చెప్పారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎస్ రామకృష్ణారావు

జాతీయ ప్రాజెక్టులకు ప్రాధాన్యత

- సిఎస్ రామకృష్ణారావు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో జాతీయ రహదారుల అధికారులు చేపట్టిన ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లు తమ జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ కేసులను వేగవంతం చేయాలని అన్నారు. శనివారం సచివాలయంలో అధికారులతో జాతీయ రహదారులు, భారత జాతీయ రహదారుల అథారిటీ ప్రాజెక్టులపై ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. భూమిని జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించాలని ఆదేశించారు. కలెక్టర్లు ఇచ్చిన సమయపాలనకు కట్టుబడి ఉండాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను పరిష్కరించడంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఎన్‌హెచ్‌ఎఐ ప్రాజెక్టుల పురోగతిపై సిఎం ఈనెల 22న సమీక్ష సమావేశం నిర్వహిస్తారని ప్రధాన కార్యదర్శి తెలిపారు. అటవీ, వన్యప్రాణుల అనుమతులకు సంబంధించిన సమస్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, రవాణా, రోడ్లు, భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, అటవీ, పర్యావరణ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, పిసిసిఎఫ్ సువర్ణ ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

అమ్మాయిల చదువే సాధికారతకు మూలం

హైకోర్టు రిటైర్డ్ జడ్జి జి.రాధారాణి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో
అమ్మాయిలు తమ కాళ్లపై తాము నిలబడటానికి, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడానికి ప్రధానమైన ఆయుధం చదువు అని తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో బాలిక సాధికారత బ్రోచర్‌ను శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలను అధిగమించాలంటే చదువు ప్రధానమైన ఆయుధమన్నారు. చదువుతో మహిళలు అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులుగాంచిన వారు అనేకమంది ఉన్నారని తెలిపారు. ఇప్పటికీ చాలా మంది మహిళల్లో స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే ధైర్యం రాకపోవడం ఈ వ్యవస్థలో ఉన్న లోపాలేనని చెప్పారు. వీటిని అధిగమించాలంటే ముందుగా తల్లితో.. ఆ తర్వాత మంచి స్నేహితులతో తమకు ఎదురైన సమస్యలను అమ్మాయిలు చెప్పుకోవాలని, అప్పటికీ పరిష్కారం కాకపోతే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమ్మాయిలు త్వరగా పెండ్లి చేసుకున్నా చదువు కొనసాగింపుకు భర్తతో, అత్తింటి కుటుంబ సభ్యులతో నిర్భయంగా చెప్పి వారి భవిష్యత్‌ను వారే దిద్దుకోవాలన్నారు. కొన్ని పరిస్థితుల్లో చట్టాలు కూడా పనిచేయడం లేదని, అందుకని స్వయం సాధికారత సాధించడానికి అమ్మాయిలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఉమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ.. చాలా సార్లు చిన్న వయసులోనే అమ్మాయిలకు ఎదురయ్యే సమస్యలకు మూలం ఇంటి వాతావరణమేనన్నారు. చదువుకోవడానికి వెళ్లే ఆకతాయిల చేతుల్లో బలవుతున్నారని, ఈ విషయం బయటకు చెబితే ఏమవుతుందోనని తల్లిదండ్రులకు కూడా చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 100, 1098, 181 వంటి హెల్ప్‌లైన్‌లను వినియోగించుకోవాలని సూచించారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ.. అమ్మాయిలు తమ కాళ్ళపై తాము ధైర్యంగా ఎదగాలన్నా.. ఎవరికివారు సాధికారతను సాధించాలన్నా.. మీతో మాట్లాడుతున్న ఎదుటివారిని గమనించాలని, వారి చూపు, వారి పిలుపు.. ప్రేమ ఆప్యాయతను కనబరుస్తుందా, ఆకలిని కనబరుస్తుందా గమనించాలని సూచించారు. విజ్ఞాన దర్శిని అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ.. నేటి చదువులు మూఢనమ్మకాల్లోకి నెట్టేస్తున్నాయన్నారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు.. బాలిక సాధికారతపై స్కిట్లు, గీతాలాపన, నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా 14 మందితో "బాలిక సాధికారికత" కమిటీ వేశారు. ఈ కార్యక్రమంలో సైకియాట్రిస్టు శైలజ, సుజావతి, అంకమ్మ, సౌదామిని, వంగపల్లి పద్మ, రజిత, తెలంగాణ బాలస్వామి ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య, ఆఫీస్ కార్యదర్శి, పిఎన్.కె బ్రాహ్మణి, మహేష్ దుర్గే, సాజిదా ఫాతిమా, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాధారాణి, అశోక్ తేజ, లావణ్య, తదితరులు

ప్రాణాలతో చెలగాటం

- కుళ్లిన చికెన్, మటన్ వినియోగం
- హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలపై నిఘా కరువు
- సూపర్‌మార్కెట్లలో గడువు ముగిసిన వస్తువుల విక్రయాలు
- ప్రమాదమని తెలిసినా గోప్యత పాటిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుళ్లిన చికెన్, మటన్, చేపల్ని వినియోగిస్తున్నారు. గడువుతీరిన, నాణ్యతా ప్రమాణాల్లేని వస్తువులతో వంటకాలు చేస్తున్నారు. అడ్డగోలుగా మసాలాలు, రసాయనాలు వాడి గుమగుమలాడే వంటకాల పేరిట నాణ్యతాప్రమాణాలకు పాతరేస్తున్నారు. ఇదీ కొన్ని దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లలోని పరిస్థితి. లాభాపేక్షతో కల్తీ, నాసిరకం వస్తువుల్ని వినియోగిస్తూ చేసే వంటకాల వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలతో పాటు మోర్, రిలయన్స్, రత్నమాల, విజేత వంటి సూపర్‌మార్కెట్లలోనూ గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. ఫిర్యాదులు చేస్తే తప్ప ఆహార తనిఖీలు చేయడం లేదు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్స్, మున్సిపల్, జిహెచ్‌ఎంసి ఆహార భద్రత విభాగం అధికారులు మొక్కుబడి తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కొద్దిపాటి జరిమానాలు విధించడం, నోటీసులివ్వడంతోనే సరిపుచ్చుతున్నారు. పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, సూపర్‌మార్కెట్ల నుంచి పెద్ద మొత్తంలో ముడుపుల రూపంలో సొమ్ము ముడుతుండడంతోనే కఠిన చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి. సేకరించే శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపడం, ఆ తర్వాత రిపోర్టులు సరిగ్గానే వచ్చాయని చెప్పి వ్యాపారుల్ని కాపాడే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇటీవల సంగారెడ్డి, హైదరాబాద్, మిర్యాలగూడ వంటి పట్టణాల్లో చేసిన తనిఖీల్లో కుళ్లిన చికెన్, మటన్, ఆహార పదార్థాలను సీజ్ చేశారు. పలు సూపర్ మార్కెట్లలో గడువు ముగిసిన వస్తువుల్ని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కానీ..! కఠినమైన చర్యలు తీసుకున్నదిలేదు.

రాష్ట్రంలో చాలా చోట్ల ఇదే విధమైన పరిస్థితి ఉన్నా తనిఖీలు చేపట్టి చిన్నపాటి చర్యలతో మమ అనిపిస్తున్నారు. పెద్దవారికి ఒక రకంగా, చిన్న వారికి మరోరకంగా అన్న పద్ధతిలో అధికారులు ఉంటున్నారని తెలిసింది. పుచ్చుకునే వాటాల ఆధారంగా ఈ చర్యలు ఉంటున్నాయని అనుకుంటున్నారు. సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు, మెదక్, సిద్దిపేట, గజ్వేల్ వంటి పట్టణాల్లో వందల సంఖ్యలో హెూటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. కానీ కేవలం రెండు, మూడు చోట్ల మాత్రమే తనిఖీలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. హోటల్స్, దాబాలు, బార్లలో నాసిరకం ఆహార పదార్థాలు అమ్ముతున్నా అటు వైపు కన్నెత్తి చూడరు. కంది మండలంలోని ఓ దాబాలో ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి నాసిరకం ఆహార పదార్థాలు, కాలం చెల్లిన రసాయనాలు, కారం పొడులు, కల్తీ నూనెలు ఉన్నాయని గుర్తించారు. ఎంఎన్‌ఆర్‌లో పురుగుల అన్నం ఉందంటూ గతేడాది జూన్ 25న తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు, కల్తీ నూనెలు, మసాలాలు గుర్తించారు. అక్కడ కూడా శాంపిల్స్ తీసుకెళ్లిన అధికారులు వాటికి సంబంధించి రిజల్ట్ ఇంకా బయట పెట్టలేదు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడి హెూటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు జరిపి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నడుస్తున్న హోటల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకొని వాటి గుర్తింపు రద్దు చేయాలని పలువురు కోరుతున్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలపై నిఘా కరువు..

గత సంవత్సరంలోనే సదాశివపేటలోని ఓ బార్‌లో విక్రయిస్తున్న ఆహార పదార్థాల్లో పురుగులు వచ్చాయి. దీనిపై సదాశివపేట మున్సిపాలిటీకి చెందిన కొందరు అధికారులు బార్ యాజమాన్యం ఇచ్చే తాయిలాలకు ఆశపడి బార్‌లో ఎలాంటి తనిఖీలు చేయకుండా అన్ని సక్రమంగా ఉన్నాయని కమిషనర్‌కు నివేదిక ఇచ్చారు. బార్ యాజమాన్యం అధికారులకు ఆమ్యామ్యాలు ఇచ్చారని, వారిపై చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు ఆందోళన చేపడితే మున్సిపల్ కమిషనర్ ఆ బార్ యాజమాన్యానికి రూ.10 వేల జరిమానా విధించి చేతులు దులిపేసుకున్నారు. అయితే, ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రజలిచ్చిన వరుస ఫిర్యాదులతో తప్పని పరిస్థితుల్లో ఆ బార్‌కు వెళ్లి కొన్ని శాంపిళ్లు సేకరించారు. కానీ ఆ బార్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

సంగారెడ్డి జిల్లాలో కనిపించని తనిఖీలు..

జిల్లాలో కొన్ని చోట్ల తనిఖీలు నిర్వహించిన అధికారులు కేవలం శాంపిళ్లు తీసుకెళ్లి చేతులు దులిపేసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూరగాయలు, పండ్లు, మాంసం వంటి వాటిపై శుచి, శుభ్రత కరువవుతోంది. చిన్న హోటళ్ల నుంచి స్టార్ హోటళ్ల దాకా ప్రతిచోటా తనిఖీలు చేయాల్సి ఉన్నా పట్టింపు కరువైంది. జిల్లాలో అసలు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారా, లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

జిహెచ్‌ఎంసి, మిర్యాలగూడలో తనిఖీలు

జిహెచ్‌ఎంసి పరిధిలోని పలు సూపర్‌మార్కెట్లలో గడువు తీరిన వస్తువుల్ని విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో జిహెచ్‌ఎంసి ఆహార భద్రతాధికారులు తనిఖీలు చేశారు. 44 చట్ల తనిఖీలు చేయగా అన్ని చోట్ల కూడా గడువు తీరిన వస్తువుల్ని గుర్తించారు. పరిశుభ్రతలేకపోవడం, బొందికల సంచారం, మాంసాన్ని ఆకుకూరలు, కూరగాయలతో కలిసి ఉంచడం వంటి వెలుగు చూశాయి. సైదాపూర్‌లోని మోర్‌సూపర్ మార్కెట్‌లో యాపిల్, కాచిగూడ ఎక్స్‌రోడ్డులోని రిలయన్స్ సూపర్‌మార్కెట్‌లో గడువు ముగిసిన ఆవకాడ, యాపిల్, నారింజ పండ్లు, కొండాపూర్‌లోని విజేత సూపర్‌మార్కెట్, కేపీఎన్ ఫ్రెస్‌లో అంబికా హోంపుడ్‌స పూతరేకులు, చక్కరగవ్వలు, సున్నుండలు కాలంతీరినవిగా గురించారు. నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ పట్టణంలోని పలు హోటళ్లల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు చేశారు.



మాట్లాడుతున్న సాగర్

పత్తి దిగుమతులపై 11 శాతం పన్ను రద్దుపై నిరసన

- సెప్టెంబర్ 25నుంచి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు
- రాష్ట్ర శిక్షణా తరగతుల్లో టి.సాగర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం పన్నును రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 25 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. వరంగల్ ఉర్సుగుట్టలోని రామసురేందర్ భవన్‌లో జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర శిక్షణ తరగతుల్లో శనివారం ఆయన భవిష్యత్ కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ.. పత్తి దిగుమతులపై 11శాతం పన్నును రద్దు చేయడం భారత రైతాంగానికి ఉరి పేనడమేనన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలని, ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచాలని కోరారు. రైతాంగం సాగులో లక్షల రూపాయల పెట్టుబడితే.. పంట చేతికి వచ్చాక మద్దతు ధరలు అందక.. మార్కెట్‌లో దళారులకు కారుచౌకగా అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టిన పెట్టుబడులు చేతికి రాక దేశ రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతోందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని.. దేశ రైతాంగానికి అనుకూలమైన విధానాలను రూపొందించి అమలు చేస్తామని ప్రకటించిన మూడ్రోజులకే అమెరికా అధ్యక్షుని ఆంక్షలకు తలొగ్గి ఆగస్టు 19న పత్తి దిగుమతులపై 11శాతం సుంకాన్ని రద్దు చేశారని విమర్శించారు. పెట్టుబడిదారీ దేశాల దిగుమతులకు ఎర్ర తివాచీలు పరిచి ఆహ్వానించడం దేశ రైతాంగానికి ఉరితాళ్లు వేయడమేనన్నారు. రైతాంగానికి విత్తనాలు, ఎరువులు, సబ్సిడీపై అందించకుండా, పండించిన పంటలకు పెట్టుబడిపై 50శాతం కలిపి మద్దతు ధరలు అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగిస్తున్నారని అన్నారు. పత్తి క్వింటాల్‌కు రూ.10,075 నిర్ణయించాలని, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిని సేకరించాలని డిమాండ్ చేశారు. అమెరికా సామ్రాజ్యవాదులకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గొద్దని సూచించారు. పత్తి దిగుమతులపై 11శాతం పన్ను రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, దిగుమతిపై 50శాతం పన్ను విధించాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 25 నుంచి గ్రామాల్లో సభలు నిర్వహించి తీర్మానం కాపీలను ప్రధానమంత్రికి పంపే కార్యక్రమంలో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్తలు దొంతి నరసింహారెడ్డి, భూపాల్ రాజు, రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పో రూ.10 లక్షల మెగా బహుమతి

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో ఇండియా తన పండగ ఉత్పత్తులను పెంచుకోవడానికి భారీ బహుమతులను ప్రకటించింది. తమ వినియోగదారుల్లో 10 మందికి నా ఒప్పో ప్రత్యేక దీపావళి రాఫెల్ ఆఫర్‌లో రూ.10 లక్షల మెగా బహుమతిని అందించనున్నట్లు పేర్కొంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 31 వరకు 'చెల్లించు 0, చింతించు 0, పొందండి రూ.10 లక్షలు'. ఆఫర్‌ను ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఒప్పో ఎఫ్31 సిరీస్, రెనో 14 సిరీస్ మీద సున్నా ముందస్తు చెల్లింపు, వడ్డీ రహిత ఇఎంఐ, ఎక్స్ఛేంజీ బహుమతిని అనందించొచ్చని పేర్కొంది. ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్‌డేస్ ప్రత్యేక సేల్‌లో వీటిని పొందొచ్చని ఆ కంపెనీ ప్రతినిధి గోల్డీ పట్నాకయ్ పేర్కొన్నారు.

22 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు

- నిమ్స్‌లో 4వ పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ శిబిరం విజయవంతం



చిన్నారులతో వైద్య బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన 4వ పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ శిబిరం విజయవంతంగా పూర్తయింది. ఈ శిబిరాన్ని నిమ్స్ కార్డియోథోరాసిక్ అండ్ వాస్క్యులర్ సర్జరీ విభాగం, డాక్టర్ రమణ బ్రిటీష్ వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రసిద్ధ పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమణ, నిమ్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.అమరేశ్‌రావు నాయకత్వంలో ప్రత్యేక వైద్యులు సేవలందించారు. 22 మంది చిన్నారులకు క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. పుట్టినప్పటి నుంచే గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు ఈ చికిత్స అందించారు. బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) మిస్టర్ గారెత్ విన్ ఓవెన్, సీనియర్ ట్రేడ్ అడ్వైజర్ మిస్ సిమ్రన్ మసాండ్ నిమ్స్‌ను సందర్శించారు. బ్రిగేడియర్ డాక్టర్ నిఖిల్ తివారి, డాక్టర్ రమణ శిష్యుడు, 92 బేస్ ఆస్పత్రి (శ్రీనగర్) డైరెక్టర్, హాస్పిటల్ "టెంపుల్"గా గుర్తింపు పొందిన సందర్భాన్ని వివరించారు. రష్యా నుంచి పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ నాటాలియా నిచే, అడ్వాల్యు హెడ్ డాక్టర్ నికోస్ బృందం నిమ్స్‌లో సేవలందించింది. 500మందికి పైగా యూకే బృందం సేవలు పొందగా, శస్త్రచికిత్స అవసరమున్న పిల్లలు.. తర్వాత నిమ్స్‌లో నమోదయ్యారు. ఈ శిబిరానికి హైదరాబాద్‌లోని అనేక ప్రయివేటు సంస్థల నుంచి జూనియర్ పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు, సర్జన్లకు హాజరయ్యారు. నిమ్స్‌లో మొదటిసారి ఆరోగ్యశ్రీ కింద ఈ శస్త్ర చికిత్సలను చేశారు. యూకే నిపుణులు పేషెంట్ బెడ్‌సైడ్‌లో మార్గదర్శకత్వం ఇచ్చారు. డాక్టర్ రమణ నిమ్స్ సౌకర్యాలు, మౌలిక వసతులు, సిబ్బంది నైపుణ్యంపై ప్రశంసలు అందించారు.

కవిత పార్టీ పెడితే జనం నమ్ముతారా? : మధుయాష్కీగౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సారా కుంభకోణానికి పాల్పడిన ఎమ్మెల్సీ కవిత రాజకీయ పార్టీ పెడితే జనం నమ్ముతారా? అని మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్ అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు బలహీన వర్గాలకు కవిత ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేండ్లు బిఆర్ఎస్ అధికారంలో ఉండి బిసిలను మోసం చేసిందని విమర్శించారు.

బిసిలయినంత మాత్రాన బిసిలకు నాయకులు కాలేరంటూ పరోక్షంగా తీన్మార్ మల్లన్ననుద్దేశించి వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో విలేకర్లతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కెసిఆర్‌కు కాళేశ్వరం ఎటిఎంగా మారిందంటూ కేంద్ర హోంమంత్రి విమర్శలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సిబిఐ విచారణకు ఆదేశించాలంటూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై అసెంబ్లీలో తీర్మానం చేసిన సిబిఐకి అప్పగించినప్పటికీ సిబిఐ ఎందుకు విచారణ ప్రారంభించలేదని ప్రశ్నించారు.

కల్వకుర్తిలో న్యూడ్ వీడియోల కలకలం!

- రూ.3.8 కోట్లు కొల్లగొట్టిన నిందితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో న్యూడ్ వీడియోల వ్యవహారం కలకలం రేపింది.. పట్టణంలోని బలరాంనగర్ కాలనీకి చెందిన ఇద్దరు మహిళలతో పాటు మరో వ్యక్తి గుర్తుతెలియని వ్యక్తులకు న్యూడ్ వీడియోలు పంపించి వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన వ్యవహారం బట్టబయలైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా పోలీసులు కల్వకుర్తికి వచ్చి నిందితులను అరెస్టు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కర్నూల్‌కు చెందిన ఓ వ్యక్తికి ట్విట్టర్‌లో న్యూడ్ వీడియోలు పంపించి.. ఆ తర్వాత ఓ మహిళ వీడియో కాల్స్ మాట్లాడి.. తక్కువ ధరకు పొలాలు, స్థలాలు అమ్ముతామని ఆ వ్యక్తిని నమ్మించి, రెండేళ్లలో రూ.3.8 కోట్లు కొల్లగొట్టినట్టు పోలీసులు గుర్తించారు. చివరికి మోసపోయానని బాధితుడు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన కర్నూల్ పోలీసులు ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన చిక్కిరి మల్లేష్, అతని భార్య పెరుమాళ్ల మేరి, స్నేహితురాలు మొల్లం మల్లిక అలియాస్ లిల్లీని అరెస్టు చేశారు. డిగ్రీ చదివిన వీరు సులభంగా డబ్బులు సంపాదించడానికి ఇలా అడ్డదారులు తొక్కారని పోలీసులు వెల్లడించారు. కొల్లగొట్టిన రూ.3.8 కోట్లలో, రూ.41.26 లక్షలతో రెండు కార్లు, బైకు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి.. మిగిలిన డబ్బును జల్సాలు, ఇతర అవసరాలకు ఖర్చు చేసినట్టు విచారణలో వెల్లడైంది.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఆర్‌టిఐని కట్టుదిట్టంగా అమలు చేయాలి

- ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) 2005ను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో శనివారం సమాచార హక్కు చట్టం-2005పై పీఐఓలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌టిఐ కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాసరావు, అయోధ్యరెడ్డి, మొహసిన్ పర్వీన్, వైష్ణవి మెర్ల, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్‌పి నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సుధీర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 17 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో జిల్లాల్లో పర్యటిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం లక్ష 50 వేల మంది సమాచారం అడుగుతున్నారని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో 137 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్కువ ఉండటంతో జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రతి అధికారి తన హక్కులు, బాధ్యతలు.. చట్టపరంగా పాటించాల్సిన మార్గదర్శకాలను తెలుసుకొని సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. పిఐఒ ఇచ్చిన సమాచారంతో సంతృప్తి చెందని పక్షంలో ఫస్ట్ అప్పిలేట్ అథారిటీని సంప్రదించేలా అవగాహన కల్పించాలని కోరారు. ఇతర కమిషనర్లు పివి.శ్రీనివాసరావు, మొహసిన్ పర్వీన్, దేశాల భూపాల్, బి.అయోధ్యరెడ్డి, వైష్ణవి మెర్ల మాట్లాడారు.. ఆర్‌టిఐ చట్టం ప్రజల్లోకి వెళ్లేందుకు అధికారులు వారధులుగా పనిచేయాలన్నారు. ప్రపంచంలోకెల్లా సమాచార హక్కు చట్టం అమలులో భారతదేశం ఎనిమిదవ స్థానంలో ఉందని తెలిపారు. దేశంలో మన రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలపాలని సూచించారు. ఈ సందర్భంగా చట్టంపై పిఐఒ, ఎపిఐఒలకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచేందుకు సమాచార హక్కు చట్టం చాలా దోహదం చేస్తుందన్నారు. ఆర్‌టిఐ మార్గదర్శకాల ప్రకారం అధికారులు దరఖాస్తుదారుకు పారదర్శకంగా సమాచారాన్ని అందించాలని సూచించారు. జిల్లాలో దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తామని తెలిపారు. అనంతరం 137 కేసులను కమిషన్ సభ్యులు పరిశీలించి పరిష్కరించారు. ముందుగా కలెక్టరేట్ ఆవరణలో రాష్ట్ర ప్రధాన కమిషనర్, కమిషనర్లు పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సమావేశంలో పిఐఒలు, ఎపిఐఒలు, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఫస్ట్ అప్పిలేట్ అధికారులు, తహశీల్దార్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పిడిసిఎల్‌లాగే.. ఎస్పిడిసిఎల్‌లోనూ జిఒ ఇవ్వాలి

- తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు



ధర్నా చేస్తున్న స్పాట్ బిల్లర్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో పని చేస్తున్న స్పాట్ బిల్లర్స్‌కు పూర్తి స్థాయిలో పని కల్పించాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లోని ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం సిఎమ్‌డి ముషారఫ్ ఫరూఖీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. స్పాట్ బిల్లర్స్ నెలలో 10 రోజులు పని చేస్తే మిగతా 20 రోజులు ఖాళీగా ఉండాల్సి వస్తుండటంతో పూట గడవని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. పదేళ్లుగా ఎస్‌పిడిసిఎల్‌ను నమ్ముకుని పని చేస్తుంటే అర్బన్‌లో ఒక వేతనం, రూరల్‌లో ఒక వేతనం ఇవ్వడం సరికాదన్నారు. దాదాపు 2వేల మంది స్పాట్ బిల్లర్స్ అరకొర వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారిలో డిగ్రీ, ఐటిఐ చదివిన వారు ఉన్నారని, అందరికీ కనీస వేతనం ఇవ్వాలని కోరారు. పీస్ రేట్‌పై పని చేస్తున్న స్పాట్ బిల్లర్స్‌కు ఒక మీటర్ రీడింగ్ తీసి బిల్లు ఇస్తే రూ.3.40 పైసలు ఇస్తున్నారని, ఇలా నెలలో రూ.5వేల వరకు మాత్రమే వస్తోందని తెలిపారు. ప్రతి నెలా 10 లోపు రీడింగ్ పూర్తి చేసి మిగిలిన 20 రోజులు అధికారులు, లైన్‌మెన్లు చెప్పే చిన్న చిన్న పనులు చేసుకుంటున్నారని అన్నారు. నెలకు వచ్చే రూ.5వేలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని, నెలంతా పని కల్పించి వేతనం ఇవ్వాలని కోరారు. ఒకటి, రెండు నెలల సమయం ఇస్తున్నామని, అయినా ఈ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే రీడింగ్ ఆపేస్తామని, అవసరమైతే చలో సెక్రటేరియెట్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వం హయాంలో ధర్నాలు చేస్తే అరెస్టు చేసేవారని, నేటి ప్రజాప్రభుత్వంలో పోలీసులు నేరుగా కార్మికుల ఇంటికి వచ్చి అరెస్టు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెక్రటేరియెట్‌కు రమ్మంటారా..? సమస్యలు పరిష్కరిస్తారా..? అని ప్రశ్నించారు. యూనియన్ రాష్ట్ర సెక్రటరీ సత్యం మాట్లాడుతూ.. ఎన్‌పిడిసిఎల్‌లో మాదిరిగా ఎస్‌పిడిసిఎల్‌లోనూ నెలలో 30 రోజుల పని కల్పిస్తూ జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్న స్పాట్ బిల్లర్స్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రతి నెలా 6-10వ తేదీ లోపు కరెంట్ బిల్లులు వచ్చేలా కృషి చేస్తున్నా.. నెలకు రూ.5వేల వేతనంతో సరిపెట్టుకోవాల్సి వస్తోందన్నారు. ఈ ధర్నాకు జిల్లాల నుంచి కార్మికులు తరలివస్తుండగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం సరికాదన్నారు.

ఓఎం సిస్టమ్ నుంచి రెండు కొత్త ఉత్పత్తులు


హైదరాబాద్ : ఇమేజింగ్ గ్లోబల్ కంపెనీ అయినా ఓఎం భారత మార్కెట్లోకి ఓఎం-5 మార్క్2 కెమెరా, ఎం.జూకో డిజిటల్ ఇడి 50-200 ఎంఎం ఎఫ్2.8 ఐఎస్ ప్రో లెన్స్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇవి వన్యప్రాణులు, మాక్రో, బర్డింగ్, ల్యాండ్‌స్కేప్, ట్రావెల్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ కోసం రూపొందించబడ్డాయని ఆ కంపెనీ ప్రతినిధి షిగెమి సుగిమోటో తెలిపారు. భారత్‌లో అత్యాధునిక సాంకేతికతతో ఫొటోగ్రాఫర్‌లను సాధికారత కల్పించడం, సృజనాత్మకతను పెంపొందించడం తమ లక్ష్యమన్నారు.

టాటా ఫ్లెక్సీ క్యాప్‌పై పెట్టుబడిదారుల మొగ్గు

హైదరాబాద్ : మార్కెట్ అస్థిరతల మధ్య కూడా టాటా ఫ్లెక్సీ క్యాప్, టాటా మల్టీ అసెట్ ఫండ్‌ల వైపు హైదరాబాద్ పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారని టాటా అసెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ మేనేజర్ శైలేష్ జైన్ పేర్కొన్నారు. ఈ ఫండ్‌ల వైవిధ్యం, అనుకూలత వల్ల ఎక్కువమందిని ఆకర్షిస్తున్నాయన్నారు. 'ప్రస్తుత మార్కెట్ అస్థిరత, వైవిధ్యంతో సౌకర్యాన్ని కలిపే పెట్టుబడి వ్యూహాలను కోరుతోంది. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్‌లలో డైనమిక్ కేటాయింపు ద్వారా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లు రాబడులను అందిస్తాయి. మల్టీ అసెట్ కేటాయింపు ఫండ్‌లు ఈక్విటీలు, స్థిర ఆదాయం, బంగారం, వస్తువులలో ఎక్స్‌పోజర్‌ను వ్యాప్తి చేయడం ద్వారా స్థిరత్వాన్ని పెంచడానికి ప్రయత్నిస్తాయి' అని శైలేష్ జైన్ అన్నారు.

పుస్తక పఠనంతో మేధోశక్తి వృద్ధి

- చరిత్రను యువత అధ్యయనం చేయాలి
- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



పుస్తక ప్రదర్శన శాల ప్రారంభించి పుస్తకాలను చూస్తున్న గిరిధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థి దశ నుంచి పండు ముసలి వరకు పుస్తక పఠనంతోనే మేధోశక్తి వృద్ధి చెందుతోందని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రావుల గిరిధర్ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో శనివారం నవతెలంగాణ పుస్తక ప్రదర్శనశాలను జిల్లా ఎస్‌పి రావుల గిరిధర్ ప్రారంభించారు. ఎస్‌పికి నవ తెలంగాణ జనరల్ మేనేజర్ వాసు, ఉమ్మడి జిల్లా మేనేజర్ కార్తీక్, ఉమ్మడి జిల్లా ప్రతినిధి పరిపూర్ణం, డెస్క్ ఇన్‌చార్జి భాస్కర్, వనపర్తి జిల్లా ఎడివిటి ఇన్‌చార్జి బాబు, రిపోర్టర్ రాము పూలబొకేలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ.. నేటి యువతీ యువకులు ఎంతో మందికి చరిత్ర తెలియక, ఉద్యోగాలు సాధించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనశాలల్లో చరిత్ర ఆనవాళ్లకు సంబంధించి ఎన్నో పుస్తకాలు ఉంటాయని, వాటిని కొనుక్కుని అధ్యయనం చేయడం ద్వారా మేధో సంపత్తి పెరుగుతుందని సూచించారు. ఎలెక్స్ హెలీ రచించిన ఏడు తరాలు, నండూరి రామ్మోహన్‌రావు రచించిన విశ్వ విజ్ఞానదర్శిని, సత్యాన్వేషణ, కాళోజీ రచించిన ఆత్మకథ 'ఇదీ నా గొడవ' వంటి పుస్తకాలు ఎన్నో ఉన్నాయని వాటిని యువత కొని చదవాలని అన్నారు. వాటితో పాటు చట్టాలు, న్యాయవ్యవస్థల తీర్పులు, లా అండ్ ఆర్డర్, ప్రజాస్వామ్య వ్యవస్థల గురించి ఎప్పటికప్పుడూ తెలుసుకోవాలని సూచించారు. చిన్ననాటి నుంచే తమ అభిరుచులకు అనుగుణంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యనభ్యసిస్తూనే సమాజానికి సంబంధించిన ఎన్నో సంఘటనలు సమాచార సేకరణలు చేయడంతో వివేకవంతులుగా తయారవుతారని చెప్పారు. ప్రతి కుటుంబంలోనూ చిన్ననాటి నుంచి పిల్లలకు చదవడం అలవాటు చేయాలని సూచించారు. అనంతరం ఎస్‌పిని నవ తెలంగాణ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జబ్బార్, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యులు గంధం నాగరాజు, నవతెలంగాణ పబ్లిషింగ్ బుక్‌హౌస్ ఇన్‌చార్జి కొమ్ము సత్యం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, కల్వకుర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల ఎడివిటి ఇన్‌చార్జులు ప్రవీణ్, రమేష్, లక్ష్మతి, తిరుమలేష్, కుమార్, దిలీప్, ఉపాధ్యాయులు, విద్యావంతులు, యువకులు పాల్గొన్నారు.

అదనంగా 1.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెలలో రాష్ట్రానికి అదనంగా మొత్తం 1.17 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్ యూరియా కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. కాకినాడ, విశాఖపట్నం, గంగవరం, మంగళూరు, జైగడ్, కృష్ణపట్నం వంటి ప్రధాన నౌకాశ్రయాల ద్వారా యూరియా రాష్ట్రానికి చేరుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడ నుంచి 15,900 మెట్రిక్ టన్నులు, విశాఖపట్నం నుంచి 37,650 మెట్రిక్ టన్నులు, గంగవరం నుంచి 27,000 మెట్రిక్ టన్నులు, మంగళూరు నుంచి 8,100 మెట్రిక్ టన్నులు, జైగడ్ నుంచి 16,200 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం నుంచి 13,000 మెట్రిక్ టన్నుల సరఫరా అవుతున్నాయని తెలిపారు. ఇప్పటికే సెప్టెంబర్ ఒకటి నుంచి రాష్ట్రానికి 1.44 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అవుతున్నదని పేర్కొన్నారు. కేంద్రం అదనంగా కేటాయించిన ఇంపోర్టెడ్ యూరియాలో ప్రస్తుతం 30,000 మెట్రిక్ టన్నులు లోడింగ్‌లో ఉండగా, రాబోయే వారంలో మరో 50,000 మెట్రిక్ టన్నులు లోడింగ్ పూర్తవుతుందని తెలిపారు.



నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన ఎసిపి

శంషాబాద్‌లో దొంగల ముఠా అరెస్ట్

- 17 తులాల బంగారం, 50 తులాల వెండి, ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగల ముఠాను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు ఎసిపి వి.శ్రీకాంత్‌గౌడ్ వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం బాలన్‌పల్లి గ్రామానికి చెందిన గుల్ల శివప్రసాద్, దంగట్ల లోకేష్, మండలి మనోహర్ హైదరాబాద్ నగరానికి వలస వచ్చారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ (కేబీహెచ్‌పీ)లోని మెన్స్ హాస్టల్‌లో ఉంటూ ప్రయివేటు ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ ముగ్గురు ఒక ముఠాగా ఏర్పడి పలు దొంగతనాలు చేశారు. శంషాబాద్‌లోని రాళ్లగూడ గ్రామం రాఘవేంద్ర కాలనీకి చెందిన నీలం సింగ్-వీరేంద్ర ప్రతాప్‌సింగ్ దంపతుల ఇంట్లో ఈనెల 9వ తేదీన చోరీ జరిగింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్‌తోపాటు విశ్వసనీయ సమాచారాన్ని సేకరించారు. వాటి ఆధారంగా ముగ్గురు నిందితులు శివప్రసాద్, లోకేష్, మనోహర్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి 17 తులాల బంగారం, 50 తులాల వెండి, గ్లామర్ బైక్, పల్సర్ బైక్, ఆర్ఎక్స్ 100 బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఆ ముగ్గురు నిందితులు ఆర్జీఐ ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్, ఎయిర్‌పోర్టులో, తాడూరు పోలీస్‌స్టేషన్, కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్టు కేసులు నమోదయ్యాయి. పది రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులను ఎసిపి అభినందించి, రివార్డు అందజేశారు.